మొక్కల సంరక్షణలో మహిళలు భాగస్వాములవ్వాలి

● బడంగ్‌పేట్ కమిషనర్ సరస్వతి

సరూర్‌నగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతో పాటు వాటి సంరక్షణలోనూ మహిళలు ప్రధాన భాగస్వాములు కావాలని మునిసిపల్ కమిషనర్ సరస్వతి సూచించారు. రానున్న వర్షాకాలంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు ఆమె తెలిపారు. అమృత్ మిత్రలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమంపై డ్వాక్రా సంఘాల మహిళలకు గురువారం అల్మాస్‌గూడ చెరువు వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకానికి సంబంధించిన బుక్‌లెట్స్, కరపత్రాలు, బ్యాగులు పంపిణీ చేశారు. కార్పొరేషన్ పరిధిలో రోడ్ల పక్కన, చెరువుల వద్ద, ఇతర ఖాళీ స్థలాల్లో పెద్దఎత్తున మొక్కలు నాటడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు కమిషనర్ చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ శ్యాంసుందర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, ఆర్పీలు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు సమస్యలను వివరిస్తున్న ధనమ్‌రెడ్డి

వెంకటేశ్వర కాలనీలో పార్కు ఏర్పాటుకు చర్యలు

● జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్

ఎల్బీనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ డివిజన్ వెంకటేశ్వరకాలనీ రోడ్డు నంబర్‌6లోని ఖాళీస్థలంలో పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ హామీనిచ్చారు. ఈ మేరకు ఆయన గురవాఆరం వెంకటేశ్వరకాలనీని ఆకస్మికంగా సందర్శించారు. కాలనీలోని సమస్యలను సంక్షేమ సంఘం అధ్యక్షుడు గందు ధనమ్‌రెడ్డి కమిషనర్‌కి వివరించారు. స్పందించిన కమిషనర్ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్, ఉపకమిషనర్ సుజాత, కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, కోశాధికారి సాయికిరణ్, శ్రీనివాస్‌రావు, సుధాకర్, నరేష్, సత్యనారాయణరెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హస్తినాపురంలో ఫ్లైఓవర్ నిర్మించాలి: కార్పొరేటర్

చంపాపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని సాగర్ రింగ్ రోడ్డు నుంచి గుర్రంగూడ వరకు ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతనాయక్ కోరారు. గురువారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో డివిజన్‌కు సంబంధించిన పలు సమస్యలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులను కార్పొరేటర్ అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, స్టాండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పటిష్ఠమైన ప్రణాళికతో అభివృద్ధి పనులు

● కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి

హయత్‌నగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): పటిష్ఠమైన ప్రణాళికతో అభివృద్ధి పనులు నిర్వహిస్తామని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి తెలిపారు. గురువారం డివిజన్‌లోని వెంకటాద్రినగర్ కాలనీ, దుర్గానగర్ కాలనీ వాసులు కార్పొరేటర్‌ను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. స్పందించిన కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని వారికి హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు సత్యనారాయణ, బీరప్ప యాదవ్, సావిత్రమ్మ, పుష్పలత, నాగరాజు గౌడ్, జగనాథ్, అంజయ్య, శివాజి, గణేశ్, మంజులత, స్వాతి పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే గృహ నిర్బంధాలా?: ఆకుల శ్రీవాణి

ఎల్బీనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తే గృహ నిర్బంధం చేయడం సరికాదని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ అన్నారు. మిస్‌వరల్డ్-2025 కంటెస్టెంట్స్ గురువారం సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోమ్‌ను సందర్శించనున్న సందర్భంగా పోలీసులు తెల్లవారుజామునే ఆకుల శ్రీవాణిఅంజన్‌ను గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజాప్రభుత్వం అంటూనే ప్రజల సమస్యలపై నిలదీసే నేతలను అక్రమంగా అరెస్టు చేయడమేమిటని ప్రశ్నించారు. తెలంగాణ ఆడపడుచులచే విదేశీ మహిళల కాళ్లు కడిగించడాన్ని తాను వ్యతిరేకిస్తున్నట్టు కార్పొరేటర్ తెలిపారు.


కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిని గృహ నిర్బంధం చేసిన పోలీసులు

వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలి

● కార్పొరేటర్ మధుసూధన్‌రెడ్డి

చంపాపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): చంపాపేట చౌరస్తాలో సాగర్ ప్రధాన రహదారిలో డీమార్టు ముందు వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు జీహెచ్ఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి కోరారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి చంపాపేట చౌరస్తాలో నీరు చేరిన సెల్లార్‌ను కార్పొరేటర్ గురువారం పరిశీలించారు. అధికారులు వెంటనే డివైడర్ కింది నుంచి వర్షం నీరు రెడ్డికాలనీ వైపు సాఫీగా వెళ్లేందుకు పైపులైన్ వేయాలని సూచించారు. కార్పొరేటర్ వెంట శ్రీశైలం, శేఖర్‌గౌడ్, అంజి ఉన్నారు.

కలిసి పని చేస్తేనే అభివృద్ధి సాధ్యం: నరసింహారెడ్డి

హయత్‌నగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి వేగంగా జరుగుతుందని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి అన్నారు. సిరిహిల్స్ కాలనీలో గురువారం ఆయన పర్యటించారు. కాలనీలో పార్కు స్థలం కబ్జాకు గురికాకుండా కాలనీ వాసులు కాపాడుకోవడాన్ని ఆయన అభినందించారు. కాలనీలో మంచినీటి పైపు లైన్లు, భూగర్భ డ్రైనేజీ పనులు, రోడ్లు తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీను, సర్వేశ్వరచారి, శంకర్ గౌడ్, ఆనంద్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వెంకటేశ్, వీర్‌చందర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

సీవరేజ్ సమస్య పరిష్కారానికి చర్యలు: ఎమ్మెల్యే

చాదర్‌ఘాట్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆజంపుర డివిజన్‌లోని చంచల్‌గూడలో గల అన్వర్‌ఖాన్ జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్ నుంచి తలెత్తుతున్న సీవరేజ్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. జలమండలి చంచల్‌గూడ లైన్ ఇన్‌స్పెక్టర్ మక్బూల్, కాంట్రాక్టర్ అతుల్‌కుమార్‌తో కలిసి గురువారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. వీలైనంత త్వరగా సీవరేజ్ పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ మల్లికార్జున్, ఎంఐఎం నాయకులు మోహియుద్దీన్ అబ్రార్ తదితరులు పాల్గొన్నారు.

● ఓపెన్ జిమ్ ప్రారంభం


బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్‌లోని వివేకానంద పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి గురువారం ప్రారంభించారు.

- వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి


ఆర్‌కేపురంలోని ఆలయంలో టీపీసీసీ ప్రతినిధి భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సురేఖ దంపతులు


కుర్మబస్తీలోని ఆలయంలో కార్పొరేటర్ అరుణారెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ


శంకేశ్వరాలయ ఆలయంలో కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్ రెడ్డి దంపతులు


శాలివాహననగర్ కాలనీలోని ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి

హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాలు జై హనుమాన్ నామస్మరణతో మార్మోగాయి. కొత్తపేటలోని స్నేహపురికాలనీ, ఎల్బీనగర్, ఆర్‌కేపురం, సరూర్‌నగర్, లింగోజిగూడ, మన్సూరాబాద్, నాగోల్, చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్, సైదాబాద్, మాదన్నపేట, మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లు, సైదాబాద్, సరూర్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు వచ్చి స్వామివారికి ఆకు, కళశపూజలతో పాటు అభిషేకాలు, హోమాలు వంటి ప్రత్యేక పూజలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పలు పార్టీల నాయకులు, ఆలయ నిర్వాహకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు. దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ జోన్ బృందం, మే 22 (ఆంధ్రజ్యోతి)


దిల్‌సుఖ్‌నగర్ మారుతి మందిర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ట్రస్టీలు నరేందర్‌గుప్తా, చంద్రయ్య


ఆటోనగర్‌లోని ఆలయంలో పూజలు చేస్తున్న జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి


మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆటోనగర్ ఆంజనేయ ఆలయ కమిటీ సభ్యులు


ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ పోచబోయిన గణేశ్‌యాదవ్


బాలాపూర్‌లోని దేవతలగుట్టపై నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న పారిజాతారెడ్డి


కర్మన్‌ఘాట్‌లోని ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి

ఐదేళ్లలో 20 వేల ఇళ్లు కట్టిస్తా

● ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 20 వేల ఇందిరమ్మ ఇళ్లను కట్టించే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రజలకు హామీనిచ్చారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. లక్ష్మారెడ్డి పాలెంలోని ఎస్ఎన్ఆర్ కళా కన్వెన్షన్‌లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరీ పత్రాను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ, అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన 874 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరీ ధ్రువపత్రాలను ఎమ్మెల్యే మల్‌రెడ్డి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నియోజకవర్గానికి మరో వెయ్యి ఇండ్లను అదనంగా మంజూరు చేయించినట్లు తెలిపారు. రెండు, మూడు నెలల్లో ఇంటి స్థలం లేని వారికి ఇంటిని నిర్మించి ఇవ్వనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. తన అనుచరులు భూకబ్జాలకు పాల్పడుతున్నారని కొందరు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని, ఆ ప్రచారాన్ని నిరూపించకపోతే జైలు పాలుకావాల్సి వస్తోందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, హౌసింగ్ శాఖ డీఈ సంపత్, ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీవో మధుసూదనాచారి, మున్సిపల్ మేనేజర్ కిరణ్, డీఈ సుమంత్, ఆర్ఓ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

హయత్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పార్టీ కార్యకర్తలకు సూచించారు. తొర్రూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో గురువారం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. పార్టీ బలోపేతానికి కష్టపడే వారిని తప్పక గుర్తిస్తామని అన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి దారాసింగ్, నాయకులు గురునాథ్‌రెడ్డి, మహిపాల్, శేఖర్‌మామ, ధన్‌రాజ్‌గౌడ్, వెంకటేశ్, ఐలయ్య పాల్గొన్నారు.


భాగ్యరెడ్డివర్మకు నివాళులర్పిస్తున్న కమిషనర్ సరస్వతి

భాగ్యరెడ్డివర్మకు నివాళి

అబ్దుల్లాపూర్‌మెట్, సరూర్‌నగర్, హైదరాబాద్ సిటీ మే 22 (ఆంధ్రజ్యోతి): దళిత వైతాళికుడు, సంఘ సంస్కర్త భాగ్యరెడ్డివర్మ జయంతిని పురస్కరించుకుని గురువారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రవీందర్‌రెడ్డి, బడంగ్‌పేట మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ సరస్వతి, నేరేడ్‌మెట్‌లోని కమిషనర్ కార్యాలయంలో అడ్మిన్ డీసీపీ ఇందిర ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మేనేజర్ కిరణ్‌కుమార్, ఏఎంసీశ్యాంసుందర్, మేనేజర్ నాగేశ్వరరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

అబ్దుల్లాపూర్‌మెట్, మే 22 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ నాలుగు రోడ్ల చౌరస్తా నుంచి వై జంక్షన్ వరకు రోడ్డు కిరువైపులా ఉన్న ఆక్రమణలను పెద్దఅంబర్‌పేట్ టౌన్ ప్లానింగ్, హయత్‌నగర్ పోలీసులు, వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం తొలగించారు.

'పాఠశాలలపై చర్యలు తీసుకోండి'

హయత్‌నగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ కుంట్లూర్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రవీంద్రభారతి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి శివకుమార్ కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై జిల్లా, మండల విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆయన కలెక్టర్‌కు వివరించారు.

అహల్యా బాయి జీవితం స్ఫూర్తిదాయకం

సైదాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాణి అహల్యాబాయి జీవితం అందరికి స్ఫూర్తిదాయకమని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి అన్నారు. మరాఠా యోధురాలు రాణి అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది ఉత్సవాలను గురువారం జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజులారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్పొరేటర్ అరుణారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్, నేతలు లింగాల హరిగైడ్, లక్ష్మి, సరిత తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న బీజేపీనాయకులు

నష్ట పరిహారం అందేలా కృషి చేస్తా

చంపాపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో నష్టపోయిన వారికి ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రజలకు హామీనిచ్చారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి చంపాపేట చౌరస్తాలోని ఓ షాపింగ్ కాంప్లెక్స్ సెల్లార్‌లోకి వర్షం నీరు చేరింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గురువారం ఆ సెల్లార్‌ను పరిశీలించారు. సెల్లార్‌లోకి వర్షపు నీరు చేరి పలు వస్తువులు నష్టపోయిన వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయాన్ని జిల్లా, మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ ఎల్బీనగర్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి, నాయకులు సదానంద్‌రెడ్డి, సతీశ్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్, యాదగిరి, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

దిల్‌సుఖ్‌నగర్: వర్షపు నీరు సాఫీగా పోయేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. న్యూ గడ్డిఅన్నారం, కమలానగర్ కాలనీల్లో గురువారం ఆయన పర్యటించారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి న్యూ గడ్డిఅన్నారం, కోదండరాంనగర్, కమలానగర్, నేతాజినగర్ తదితర కాలనీలలో పర్యటించి వరదసహాయక చర్యలు చేపట్టారు. మాజీ కార్పొరేటర్ భవానీ ప్రవీణ్ కుమార్, రమేష్ శ్రీశైలం పాల్గొన్నారు.


వర్షానికి తడిసిపోయిన ల్యాప్‌టాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్

ముంచెత్తిన వరద

జలమయమైన రహదారులు

దిల్‌సుఖ్‌నగర్, చంపాపేట, ఓల్డ్‌మలక్‌పేట, మే 22 (ఆంధ్రజ్యోతి): బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి రహదారులన్ని జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో ఇంటి ముందు పార్కు చేసిన వాహనాలు కొట్టుకుపోయాయి. సరూర్‌నగర్ చెరువు లోతట్టున ఉన్న శారదనగర్, కోదండరాంనగర్, సీసల బస్తీ, తిరుమలనగర్, పీఅండ్‌టీ కాలనీ, కమలానగర్, నేతాజీనగర్ కాలనీలలో వరదనీరు ఏరులై ప్రవహించింది. చంపాపేట చౌరస్తా సాగర్ ప్రధాన రహదారిపై డీమార్టు ముందు వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. మలక్‌పేట నల్లగొండ చౌరస్తాలో ఉన్న వికలాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలోని ప్రాజెక్ట్ కార్యాలయంలోకి పెద్దఎత్తున వరనీరు వచ్చి చేరింది. అదే విధంగా ఓల్డ్‌మలక్‌పేటలోని పోచమ్మ ఆలయం ముందు.. పై నుంచి వచ్చిన రాళ్లు, ఇసుకను గురువారం జీహెచ్ఎంసీ సిబ్బంది యంత్రాల సాయంతో తొలగించారు. వర్షాకాలంలోగా అధికారులు స్పందించి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


చంపాపేట: వర్షానికి జలమయమైన సాగర్ ప్రధాన రహదారి

సత్యనారాయణ సేవలు మరువలేనివి

● సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి

మన్సూరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): కార్మికులు, పేద ప్రజల శ్రేయస్సు కోసం సత్యనారాయణ అందించిన సేవలు మరువలేనివని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్‌లోని టీసీఐ ఇండస్ట్రీలో గురువారం సత్యనారాయణ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేసరి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి సత్యనారాయణ సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో సత్యనారాయణ అందించిన సేవలను నర్సిరెడ్డి గుర్తు చేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎల్లయ్య, టీసీఐ ఉపాధ్యక్షుడు సుధీర్, రాజ్‌కుమార్, చిరంజీవి పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభించకపోతే నిరవధిక దీక్ష

● శివారు కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు

వనస్థలిపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శివారు కాలనీలకు ప్రధాన సమస్యగా మారిన డ్రైనేజీ పనులు శుక్రవారం లోగా ప్రారంభించాలని శివారు కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరవదిధక నిరహార దీక్ష చేపడుతామని వారు హెచ్చరించారు. ఈ మేరకు పలు కాలనీల సంక్షేమ సంఘం అధ్యక్షులు గురువారం డివిజన్‌లోని బృందావన్ మీడోస్ కాలనీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు శశికాంత్ మాట్లాడుతూ నిధులు మంజూరైనప్పటికీ పనులను ఎందుకు ప్రారంభించడం లేదని వారు ప్రశ్నించారు. తమకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని, కొందరు నాయకులు కావాలని అడ్డుకోవడం సరికాదన్నారు. అధికారులు స్పందించి తక్షణమే డ్రైనేజీ పనులు ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. కాలనీవాసులు నందకిషోర్, సరస్వతి, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వేణు, సహదేవ్, ప్రభాకర్, శివశంకర్ పాల్గొన్నారు.

● ఆలయ ముఖద్వారం ప్రారంభం


బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ మారుతినగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన అభయాంజనేయ స్వామి ఆలయ ముఖద్వారాన్ని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, అర్చకులు ఈశ్వర్ శర్మ, శ్రీనివాస్, రాంబాబు, రంగారావు, శ్రీకాంత్‌గుప్తా, రవివర్మ, రవికిరణ్ సింగ్, చిదంబరం తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురం, మే 22(ఆంధ్రజ్యోతి)

స్కూటీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

● బస్ డ్రైవర్‌పై కేసు నమోదు

చంపాపేట, మే 22(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న స్కూటీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్‌పై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంచన్‌బాగ్‌లోని డీఎమ్ఆర్ఎల్‌లో పని చేస్తున్న ఉద్యోగి ప్రీతి(40) గురువారం కర్మన్‌ఘాట్ నుంచి వస్తూ డీఎంఆర్ఎల్ చౌరస్తా వద్ద సిగ్నల్ పడడంతో ఆగింది. రాజేంద్రనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆగిఉన్న స్కూటీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రీతి ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కమల్‌కుమార్ తెలిపారు.

పార్కు చేసిన కారును ఢీకొట్టిన మరో కారు

హైదరాబాద్ సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు పార్క్ చేసిన కారును ఢీ మరో కారు ఢీ కొట్టిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ ప్రమాదంలో ఇంటి ముందు పార్క్ చేసిన రెండు కార్లు ధ్వంసం అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట శివసాయి ఫ్లోరా అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న న్యాయవాది శశివర్ధన్ బుధవారం రాత్రి ఇంటి ముందు కారును పార్క్ చేశారు. రాత్రి 3గంటల సమయంలో టీఎస్07ఈసీ1127 నెంబర్ గల కారును నడుపుతున్న వ్యక్తి వేగంగా వచ్చి నిలిపి ఉన్న కారును ఢీ కొట్టాడు. కారులో ఓ వ్యక్తి గాయపడగా.. కారు నడుపుతున్న వ్యక్తి పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదుతో సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యం

సైదాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉంటున్న ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సరస్వతీనగర్ కాలనీలో కంబాలపల్లి జలంధర్‌రెడ్డి(70) నివాసముంటున్నాడు. మంగళవారం సోదరి, బావ అతడిని కలిసేందుకు రాగా ఇంటికి తాళం వేసి ఉంది. ఇంటిని తెరిచి చూడగా ఫోన్, వ్యక్తిగత పత్రాలు కనిపించాయి. అతని గురించి చుట్టు పక్కల వెతికారు. జలంధర్‌రెడ్డి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.